# పునస్సమాగమం




రచయిత:
డి. వి. సుబ్బారావు

ఎక్స్‌ప్రెస్‌కూతవేసి కదలడానికి సిద్ధముగా వుంది — గార్డు వేసిన విజిల్‌తో. ఆదరాబాదరాగా సెకండ్‌క్లాస్ కంపార్టు మెంటులోకి ఒక ముసలాయన ఎక్కాడు.

నల్లద్దాల కళ్ళజోడు, నెరిసిన తల, శుష్కించిన శరీరముతో ఆయన కొంత విచిత్రముగావున్నాడు. మొహంలో ఏదో అనిర్వచనీయమైన గంభీరం ద్యోతకమవుతోంది. అతడు ధరించిన సామాన్యదుస్తులను, చేతిలోనున్నమాసిన సంచిని, బీదరికాన్నిచాటే అతని వాలకాన్నిచూసి, కిటికీవద్ద కూర్చున్న ఒక వయసుమళ్లిన, స్త్రీ చీదరించుకొంది.

"ఇది సెకండ్‌క్లాస్ కంపార్టుమెంట్ ? మీరిదే థర్డు క్లాస్ అనుకొని ఎక్కినట్లున్నారు?" అంది వ్యంగ్యంగా. ఒక నిమిషంసేపు ఆమెను నిదానించి చూచి — చిన్నగా వస్తున్న నవ్వును పెదవులలోనే భద్రపరచుకొని "థర్డు క్లాస్‌లోనికి వెళ్ళడానికి వ్యవధిలేక .... ఇది సెకండ్‌క్లాస్ కంపార్టుమెంటు అని తెలిసివుండే ఎక్కేశాను. క్షమించండి....ప్రక్కస్టేషన్‌లో దిగిపోతాను" అన్నాడు.

ఆమె అతడివంక అర్ధరహితంగా చూసి ముఖం తిప్పేసుకొంది. నిజానికి ఎక్స్‌ప్రెస్ ఆగే తరువాతస్టేషను రెండు వందలమైళ్ళ తరువాతగాని లేదు. ఇది తలచుకొని తనలో తానే నవ్వుకొన్నాడాయన బెర్తుమీద కూర్చుంటూ అతని దృష్టిని బాగా ఆకర్షించినవారల్లా—ఆమె ప్రక్కనే. కూర్చొని, కిటికీలో నుంచి బైటపరిగెత్తుతున్న చెట్లను, కొండలను అత్యంత ఆసక్తితో చూస్తున్న అయిదేళ్ల పాప, పాపప్రక్కనే కూర్చున్న ఏడేళ్ళ కుర్రవాడు.

ఆయన కంపార్టుమెంటులోకి ప్రవేశించినప్పటినుండి ఆయనవంకేచూస్తూ కూర్చున్నాడా పిల్లవాడు. ఆయనచిఱు నవ్వునవ్వితే ఆ కుర్రవాడు నవ్వుతాడు. అయన నవ్వడం మానేస్తే ఆ కుర్రవాడుకూడా మానేస్తాడు.

ఇలా అరగంట జరిగిపోయింది. అప్రయత్నంగా ఆయనకళ్లు బెర్తుపై నిద్రపోతున్న యువకునిమీద నిల్చాయి. " ఈవిడ బంధువుకాబోలు " అనుకొన్నాడు. ఇంతలో ఆ కుర్రవాడు అవులిస్తూ "ఏదైనా కథ చెప్పవే! అనూ!" అని మారాంచేస్తున్నట్లుగా అడిగాడు. ఆమె ఎంత సేపటికి బదులు చెప్పకపోయేసరికి కుర్రవాడు మరల పెద్దగా "అమ్మమ్మా ! ఒక కధ చెప్పవే ? "

కిటికీలోనుండి తదేకంగా బైటకు చూస్తున్న ఆవిడేమి మాటలాడలేదు. కుర్రవాడు వూరుకోలేదు. "అమ్మమ్మా!" అని కేకవేశాడు.

ఆవిడ కిటికీలోనుండి కుర్రవానిమీదకు దృష్టిని మరల్చి "అబ్బబ్బా! నీ కెప్పుడూ కథలేనట్రా బాబులూ?" అంది విసుగ్గా.

ముసలాయన తలవంచుకొని, సంచిలోనుండి న్యూస్ పేపర్ బైటకుతీసి చదవడానికి ప్రయత్నించాడు.

"అమ్మమ్మా! ఒక్కకథ చాలు. ఇక మళ్లీ అడగనుగా!" అని జాలిగా అడిగాడు కుర్రవాడు.

ఇంతలో పాపకూడా ఆమెవైపు తిరిగి "ఒక్క కథ చెప్పమ్మా!" అన్నది మూతి సున్నాలాచుట్టి కళ్ళు పెద్ద విగాచేస్తూ. ముసలాయన చిన్నగా నవ్వాడు — పేపరు ముఖాన్ని దాచుకొని—

"అబ్బబ్బా! నా ప్రాణాల్ని తోడేస్తున్నార్రా!" అని గొణిగి "ఊఁ వినండి" అని తెనాలి రామలింగనికథలలో ఒక కథ చెప్ప నారంభించింది. మరల ఒక్కొక్కసారి మధ్యలో ముసలాయన వైపొకసారి చూసి చెప్పుకుపో నారంభించింది.

"ఒకవూరిలో తెనాలి రామలింగడు అనే కవి వుండే వాడు. అతడు ఎప్పుడూ ఎవరో ఒకర్ని ఏడిపిస్తుయుండే వాడు. ఒకరోజున వారియింటిలో దొంగతనము చేయుటకు ఒక దొంగ వచ్చాడు. ఆ దొంగచేసే ఆలికిడి విని తెనాలి రామలింగడు వాడ్ని చాలా అవస్థలుపెట్టి పంపించేశాడు" అని కథ ముగింపుచేసేసింది. అంతవరకూ 'ఊ'కొడుతున్న పాప చప్పరించి ' బాగాలేదని ' అంది. ప్రక్కన కూర్చొని వున్న కుర్రవాడుకూడా 'ఈకథ ఇదివరలో చెప్పావుకదా! బాగాలేదు, ఇంకొకకథ చెప్పవూ'అని మారాంచేయసాగారు.

'అమ్మమ్మ చాలా కోపపడింది. పేపరు ముఖం అడ్డు వుండుటవలన లోలోపల ముసలాయన నవ్వుకొనిన నవ్వు ఎవరూ చూడలేదు.

"ఇంకొకకథ చెప్పాలే అమ్మా!" అని పిల్లలు మారాం చేయుట మానలేదు.

ఆ ముసలాయన తను దెచ్చుకున్న సంచీతీసి దానిలో నుంచి బిస్కట్ ప్యాకెట్, చాక్‌లెట్ డబ్బా తీసి బయట పెట్టాడు. ఆ బిస్కట్‌ప్యాకెట్, చాక్‌లెట్‌డబ్బా చూచిన వెంటనే ఆ పాపకు నోరువూరింది. ముసలాయన బిస్కట్లు చాక్‌లెట్లు ఆ పాపచేతిలో కొద్దికొద్దిగా యిచ్చాడు. కుర్రవాడి చేతికికూడా కొద్దిగాయిచ్చి తనలో తానే చిన్నగా నవ్వుకొన్నాడు. అంతలోనే, ఆ పిల్లలు యిద్దరిని అంత త్వరలోనే చొరవతీసుకున్నందుకు ఆమె చాలా ఆశ్చర్యపడింది.

ఆ ముసలాయనకూడా రెండు బిళ్లలను నోట్లోవేసుకుని యధాప్రకారంగా మిగిలిన బిస్కట్లు, చాక్‌లెట్లు తన సంచీలో వేసుకొని చెవులుమాత్రం ఆమెవున్నవైపుకు పెట్టి ఏదో ఆలోచించుకొంటూ కూర్చున్నాడు. ఆమె ఒక్కక్షణం ముసలాయనవైపు చూచి చిన్నగా ఒక నిట్టూర్పు విడిచింది.

తర్వాత చాలాసేపటివరకు ఆ కుర్రాళ్లతో ముద్దుగా చిలిపిగా, నవ్వించి. కవ్వించి, ఆటలాడుకొన్నాడు. తరువాత కుర్రవాళ్ళిద్దరు ముసలాయనతో 'ఏదైనా మంచికథ ఒకటి చెప్పండి. మా అమ్మచెప్పిన కథ బాగాలేదు. మా అమ్మచెప్పినకథకంటే బాగుండాలి' అన్నారు.

"ఊఁ" చెప్పండి అన్నట్లు కుర్రాడుకూడా చూశాడు.

ముసలాయన ఆవిడవంక ఒకటి రెండు నిమిషములు చూచి కథ చెప్పడం ప్రారంభించాడు. పిల్లలిద్దరూ ఆయన ప్రక్కనే కూర్చొని 'ఊఁ'కొట్టడం ప్రారంభించారు.

"అనగనగా ఒక వూరిలో ఒక ధనవంతుడున్నాడు. లక్షాధికారి. అతనికి చాలారోజులకు లేక లేక ఒక కూతురు పుట్టినది. ఆ అమ్మాయిపేరు పద్మావతి. ఆ అమ్మాయికి పది సంవత్సరములు వచ్చినప్పటినుండి ఇంటివద్దవుండేది గాదు. ఎప్పుడూ వాళ్లవూరిలోవున్న దేవాలయమునకుపోయి పూలుకోసుకొని, చాలావరకు ఆటలాడుకొని వస్తుండేది. ఆ అమ్మాయి మాదిరే ఒక అబ్బాయికూడా ఆ దేవుడిగుడికి వచ్చి మంచి మంచి పూలుకోసి ఆ అమ్మాయికి యిస్తూ యుండేవాడు.

కొన్నాళ్లకి ఆ అబ్బాయి ఆ అమ్మాయి ఎంతో స్నేహితులయ్యారు. పువ్వులేరడం అయిపోగానే రోజూ యిద్దరు కలిసి ఎన్నెన్నో కబుర్లు చెప్పుకుంటూ, ఎంతోసేపు ముచ్చటగా ఆడుకొనేవారు.

ఇలాగ ఎన్నోరోజులు అయిపోయాయి. ఆ అమ్మాయంటే ఆ అబ్బాయికెంతో యిష్టం. ఆ అబ్బాయంటే అమ్మాయికి కూడా అంత యిష్టంవుండేది. ఆ అబ్బాయితోపాటు అమ్మాయికూడా పెరిగి పెద్దదయింది. ఇద్దరూ పెళ్లికూడా చేసుకుందామనుకున్నారు. ఆ అమ్మాయేమో వాళ్లనాన్న గారితో తన స్నేహితున్ని పెళ్ళాడతానని చెప్పింది.

ఆ అబ్బాయేమో చాలా బీదవాడు. ఆ అమ్మాయి నాన్న చాలా డబ్బుకలవాడు. అందుకని ఆ అబ్బాయికి తన కుమార్తెను యిచ్చి పెళ్లిచేయడం తనకు సుతరామూ యిష్టములేదు. ఆ అమ్మాయి ఎంత బ్రతిమాలినా, ఎంత ఏడ్చినా లాభంలేకపోయింది. ఆ అమ్మాయిని మరో గొప్ప వాళ్ల అబ్బాయికిచ్చి వైభవంగా పెళ్ళిచేశారు.

అమ్మాయికి రోజూ పూలు ఏరిచ్చే అబ్బాయి కుయ్యో, మొర్రో అనుకుంటూ ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు.

చాలా సంవత్సరాలయాక — అంటే చాలా రోజుల తరువాత అన్నమాట—ఆ అబ్బాయి, ఆ అమ్మాయి ఒక చోట అకస్మాత్తుగా కల్సుకొని నవ్వుకొన్నారు. అంటే ఇక కథకంచికి మనమింటికి? అని ముసలాయనకథ ముగించేశాడు.

పాప కథ అయినాకూడా 'ఊఁ' కొట్టడం ఆగలేదు.

"బావుందండి" అన్నాడు కుర్రవాడు.

ఆవిడ కిటికీవద్దనుండి అటూ, యిటూ కదిలింది. ఆయన నవ్వడానికి ప్రయత్నిస్తూ 'ఆదిసరేగాని, ఆ కథలోని అబ్బాయిపేరు అడగరేం' అన్నాడు ముసలాయన.

"ఏం పేరండి?" అన్నాడు కుర్రవాడు.

కిటికీవద్దనున్న ఆవిడచెవులు ఇటుప్రక్కకు వచ్చాయి.

ఆమెవంక ముసలాయన చూస్తూ 'ఆ అబ్బాయిపేరు మోహన్' అన్నాడు.

ఆశ్చర్యపడి వెనక్కు తిరిగిచూచిందామె. 'మీరా' అంది ఆమె. ఆమెకంఠంలో ఏదో ఒకవిధమైనబాధ ధ్వనించింది. 'అవును! నేనే పద్మా' అన్నా డాయన ఎంతో బాధగా. వారిద్దరు తమ మనస్సులను వెనుకటి మధురస్మృతులను నెమరువేసుకొన్నారు.

